క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

కాచిగూడ: ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీఎస్ ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈరోజు ఉదయం 11 గంటల నుంచి 12 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రయాణికుల సమస్యలను 9959226130 నంబరును సంప్రదించి తగిన సూచనలు చేయాలని ఆయన కోరారు. బర్కత్‌పుర డిపోలో..

- బర్కత్‌పుర డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం పవన్‌కుమార్ ప్రకటించారు. మరిన్ని వివరాలకు 9000006069 సంప్రదించాలన్నారు.

టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై రాష్ట్ర వ్యాప్త నిరసనలు


మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో అసలు సూత్రదారులను నిరూపించేందుకు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అన్ని రకాల ప్రభుత్వ నియామక బోర్డులను రద్దు చేసి ప్రభుత్వ ప్రత్యేక్ష ప్రమేయం లేని స్వతంత్ర సంస్థల ద్వారానే నియామక ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నాయకులు నీల వెంకటేష్, సుధాకర్‌ముదిరాజ్, హెచ్.రాజేందర్, అనంతయ్య, రాంబాబు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

నల్లకుంట: నల్లకుంట విద్యానగర్ రోడ్డులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ఒకేషనల్ ట్రైనింగ్ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఆఫీస్ ఆటోమేషన్ కంప్యూటర్ కోర్సుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. మూడు నెలల కాల వ్యవధితో కూడిన ఈ కోర్సుల్లో దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 3 చివరి తేదీ అని సెంటర్ ప్రిన్సిపాల్ పద్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 70134 45971 నంబరును సంప్రదించాలని కోరారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

కాచిగూడ: ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కాచిగూడ ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు అన్నారు. సోమవారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యాలు కలగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. రంజాన్ సందర్భంగా మసీదుల వద్ద బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామన్నారు. అడ్మిన్ ఎస్సై రవికుమార్, ఎస్సైలు సురేష్ కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఘనంగా సీతారామ ఉత్సవాలు



చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయం, వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో స్థాపిత దేవతాహోమం, సుదర్శనహోమం, మంత్రపుష్పం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ మురళీప్రసాద్, ఈఓ దేవనాథం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- లక్ష్మీగణపతిదేవాలయంలో సీతారామాంజనేయస్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం భక్తులు విష్ణుసహస్రనామ పారాయణాలు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మారెడ్డి, అర్చకులు శర్మ, రామాచారి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

కాచిగూడ: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హిందువుల పట్ల చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి హిందువుల సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని విశ్వాసాలను విమర్శించడం సరికాదన్నారు.

దుష్ప్రచారంపై ఫిర్యాదు..

కాచిగూడ: శ్రీరామనవమి, హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహించే శోభాయాత్ర విషయంలో ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తున్న బీజేపీ నేత రాకేష్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ కాచిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎర్ర భీష్మదేవ్, ప్రధానకార్యదర్శి సదానంద్‌ల ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, పేరి శేషు, నేమదాది సత్యేందర్, రాజేష్, మహేష్, బబ్లూ సింగ్, అంటోని, పెంట రమేష్, నర్సింగ్‌బాబు తదితరులున్నారు.

కలవని 'ఆత్మ'లు !

- ఆత్మీయ సమ్మేళనానికి ముఖం చాటేసిన పలువురు నేతలు
- తొలిరోజు ఆత్మీయ సమ్మేళనం అంతంత మాత్రమే..



ముషీరాబాద్: బీఆర్ఎస్ ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలనుకున్న ఆత్మీయ సమ్మేళనానికి మొదటి రోజు పలువురు నేతలు ముఖం చాటేశారు. ముఖ్య అతిథులుగా రావాల్సిన హైదరాబాద్ జిల్లా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఆత్మీయ సమ్మేళనాల జిల్లా పరిశీలకులు దాసోజు శ్రావణ్‌కుమార్‌లు రాకపోవడం సమ్మేళన ప్రాముఖ్యతను తగ్గింది.

- ఇక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నేతల మధ్య ఉన్న విబేధాలను పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేయాలనే లక్ష్యంతో నిర్వహించే ఈ కార్యక్రమానికి పలువురు నేతలు గైర్హాజరు కావడం చర్చనీయంశంగా మారింది.
- ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహల షోగా ఈ ఆత్మీయ సమ్మేళనం కనిపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.
- నియోజకవర్గంలో సీనియర్ నాయకులు ఎం ఎన్ శ్రీనివాస్‌రావు, రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్, నాయిని నర్సింహ్మారెడ్డి అల్లుడు వి.శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ముషీరాబాద్ మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మీహరిబాబుయాదవ్, కవాడిగూడ మాజీ కార్పొరేటర్ లాస్యనందితలు వేదికపై కనిపించకపోవడం గమనార్హం.
- ఇక ఇటీవల బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ హేమలత జయరామ్‌రెడ్డిల మధ్య ఉన్న పంచాయతీని కేటీఆర్ సమక్షంలో పరిష్కరించినా ఇద్దరు సమ్మేళనానికి హాజరుకాకపోవడం విమర్శలకు తావిస్తోంది.
- తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ పార్టీలో మొదటి నుంచి పనిచేసిన పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా అంతంత మాత్రంగానే హాజరయ్యారు.
- ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశాలున్నా వాటికి ప్రాధాన్యత ఇవ్వకుండా వ్యక్తిగత ఇమేజ్ కోసం, పోటాపోటీ నినాదాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపించింది.
- మొదటి రోజు కావడంతో మిగతా డివిజన్‌ల నుంచి నాయకులు వచ్చినప్పటికీ కవాడిగూడ డివిజన్‌లోని బస్తీల నుంచి తీసుకొచ్చిన మహిళలే అధికంగా కనిపించారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.
- ఈ విషయంపై కొంత మంది కార్పొరేటర్లు, సీనియర్ నేతలను సంప్రదించగా 'తమకు ఆహ్వానం అందలేదని ఎప్పుడూ.. కార్యక్రమాలకు పిలవని నేతలు ఆత్మీయ సమ్మేళనానికి పిలిస్తే వస్తామా.. అంటూ మరికొందరు నేతలు పేదవివిరచడం కనిపించింది'. ఏది ఏమైనప్పటికీ మొదటి రోజు ఆత్మీయ సమ్మేళనం అంతంత మాత్రంగానే జరిగిందని వినికిడి.

అభివృద్ధి జరగనట్లు నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను..


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలోనే అన్ని రంగాల అభివృద్ధి జరిగిందని తాము చేసిన అభివృద్ధి కంటే ఎక్కువ అభివృద్ధి చేసినట్లు ఎవరైనా నిరూపిస్తే వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయనని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రతిపక్ష పార్టీ నేతలకు సవాల్ విసిరారు.

- 2018 నుంచి నేటి వరకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని 6 మున్సిపల్ డివిజన్‌లలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశామని ఆయన స్పష్టం చేశారు.
- ప్రతిపక్ష పార్టీ నేతలు తనకంటే ఎక్కువ ఎవరైనా అభివృద్ధి చేసినట్లు నిరూపిస్తే పోటీ చేయకుండా రాజకీయాల నుంచి నిష్క్రమిస్తానన్నారు.
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముషీరాబాద్ నియోజకవర్గం హైదరాబాద్‌కే ఆదర్శంగా నిలిచిందన్నారు.
- సోమవారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఆర్.కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ కవాడిగూడ నేతల ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ జెండాను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు ముఠా జైసింహ, ముషీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. విబేధాలను పక్కన పెట్టి నాయకులంతా ఒకే తాటిపైకి వచ్చేందుకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.
- రైతులు, దళితులు, బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చి తీరాలని ఆయన కోరారు. సాయికిరణ్ యాదవ్, బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ముఠా జైసింహ, మైనార్టీ కమిషన్ వైస్ చైర్మన్ శంకర్‌లూక్, మాజీ కార్పొరేటర్లు రవీందర్, ముఠా పద్మానరేష్, మాచర్ల పద్మజ, బీఆర్ఎస్ కవాడిగూడ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, ఎన్.డీ.సాయికృష్ణ, రాష్ట్ర నాయకులు ఎస్.యాదగిరి, నగర నాయకులు కల్వగోపి, వల్లాల శ్రీనివాస్‌యాదవ్ వివిధ డివిజన్‌ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మైసయ్య గౌడ్ సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ రవిచారి, రాహుల్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజా నాయకుడు, దివంగత బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుండగోని మైసయ్య సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. నక్సల్స్ చేతిలో హత్యకు గురైన మైసయ్యగౌడ్ 24వ వర్ధంతిని సోమవారం బాగ్‌లింగంపల్లిలోని వివేకానంద విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ కుమారుడు రాహుల్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మైసయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా అత్యంత ప్రజాధరణ పొందిన నాయకుడు మైసయ్యగౌడ్ అని కొనియాడారు. వారు భౌతికంగా లేకపోయిన ప్రజల మధ్య నిత్యం జీవించి ఉంటారన్నారు. సీనియర్ బీజేపీ నాయకులు కిరణ్, గోపి, నితిన్‌గౌడ్, మంగల, భరత్‌భూషణ్, రఘువీర్, రామ్మోహన్‌గౌడ్, ఉపేందర్, రమేష్‌గౌడ్, వాసు తదితరులున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి


డాక్టర్లతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనీ

చిక్కడపల్లి: పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ అన్నారు. సోమవారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీ దవాఖానాలో ఆకస్మిక తనిఖీ చేసి వైద్య సేవల గురించి డాక్టర్ అమీనాను అడిగి తెలుసుకున్నారు. రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులను అందించాలని సూచించారు. సిబ్బంది హాజరు పట్టికతో పాటు మందుల నిల్వ వివరాలను నమోదు చేసే రిజిస్ట్రార్‌ను పరిశీలించారు. మెరుగైన చికిత్స అందించడంలో ఎలాంటి లోటుపాట్లు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, ఉమేష్, లక్ష్మణ్‌యాదవ్, రాజు, స్టాఫ్ నర్సుగ్యాబ్రెల్, అనుపమ పాల్గొన్నారు.

పౌష్టిక ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలి


బండమైసమ్మనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: పౌష్టిక ఆహారంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ అన్నారు. సోమవారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్లతో పౌష్టిక ఆహారంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. పిల్లలు, బాలికలు, మహిళలకు పౌష్టికాహార లోపం వల్ల అనేక రకాల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పిల్లలను ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడానికి అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని ఆమె కోరారు. తాగునీరు, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన పెంపొందించాలని ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, శ్రీనివాస్‌ముదిరాజ్, సలంద్రి రమేష్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్లలో సెల్‌ఫోన్లు చోరీ ..

కాచిగూడ: తిరుపతి రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడి బ్యాగులోంచి గుర్తు తెలియని వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్‌కు చెందిన ఇంద్రశేఖర్ (37) తిరుపతి రైల్లో కాచిగూడకు వస్తుండగా.. తిరుపతి రైల్వే స్టేషన్‌లో దుండగులు ఫోన్ దొంగలించగా బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హజ్రాత్ నిజాముద్దీన్ రైల్లో..

- హజ్రాత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి రైల్లో లూదియా ప్రాంతానికి చెందిన మనోజ్ కుమార్‌సింగ్ (44) కాచిగూడకు వస్తుండగా.. మార్గం మధ్యలో బల్లార్ష రైల్వే స్టేషన్ సమీపంలో దుండగుడు సెల్‌ఫోన్‌ను దొంగిలించారు. బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మంగళూర్ రైల్లో..

- మంగళూర్ రైల్లో ఈరోడ్‌కు చెందిన ఓలోబీర్ సింగ్ (50) కాచిగూడకు వస్తుండగా.. గుర్తుతెలియని సెల్‌ఫోన్‌ను దొంగించారు. కాగా బాధితుడు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో ట్యాప్‌టాప్..

- చిత్తూరు ప్రాంతానికి చెందిన వినిత్ కుమార్ (24) వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడకు వస్తుండగా.. మార్గం మధ్యలో పేలమనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి బ్యాగులోంచి ల్యాప్‌టాప్ దొంగిలించాడు. బాధితుడు సోమవారం కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం ఆయా రైల్వే పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు.

హనుమాన్ దేవాలయ నూతన రథం ప్రారంభం

కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయంలో ఆలయ చైర్మన్ గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్ ధర్మకర్తల సభ్యుల ఆధ్వర్యంలో రూ.13 లక్షలతో నూతనంగా రథాన్ని ఏర్పాటు చేశారు. ఈ రథాన్ని సోమవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించి రథాన్ని స్వయంగా లాగి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రచనశ్రీ, దేవాలయ భక్తులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, కే.ఆర్.కె.ప్రసాద్, ఆలయ ధర్మకర్తలు జి.వేణుగోపాల్, సంతోష్, పురుషోత్తం, శేఖర్, బీజేపీ నాయకులు వెంకటేష్, బీఆర్ఎస్ నేతలు ఎన్.డీ.సాయికృష్ణ, ప్రభాకర్ తదితరులున్నారు.

ఉద్యోగాల భర్తీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

కాచిగూడ: ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ అన్నారు. సోమవారం కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేని ప్రభుత్వాలు వెంటనే నిరుద్యోగ భృతిని అందజేయాలన్నారు. వేలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా భర్తీ చేయకుండా నిరుద్యోగులను కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వాలు మోసగిస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగ ఖాళీలపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, నల్లెల కిషోర్, భూషన్ భాస్కర్, చేతన్, ఆలీం తదితరులున్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

అంబర్‌పేట: పార్క్‌లో వాకింగ్ చేస్తూ ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌అంబర్‌పేట డివిజన్ ఎస్‌బీఐ కాలనీలో నివసించే లక్ష్మీపతి(75) స్థానిక కాలనీ పార్కులో ఆదివారం సాయంత్రం వాకింగ్ చేస్తూ.. ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు. పక్కనే వాకింగ్ చేస్తున్న స్థానికులు 108కి సమాచారం అందించి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ప్రస్తుతం వారు అమెరికాలో ఉంటున్నట్లు సమాచారం.

పండితులను సన్మానించుకోవడం మంచి సంప్రదాయం


పండితులను సన్మానిస్తున్న సిరికొండ మధుసూదనాచారి

చిక్కడపల్లి: పండితులను సన్మానించుకోవడం మంచి సంప్రదాయమని తెలంగాణ అసెంబ్లీ తొలి శాసన సభాపతి, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల ఉగాది సంబరాలు సోమవారం రాత్రి త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళా సుబ్బారావు కళావేదికలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మహా జ్యోతిష్యపండితులు ఎస్.మహేష్‌చందర్ భరద్వాజ్, ప్రసాదశర్మ, సుమన్‌శర్మ, రమణిశ్రీనివాస్, కృష్ణమాచార్యులు, హరి, శివకుమార్, మల్లికార్జునరావు, నాగేశ్వరరావులను శోభకృత్ నామ సంవత్సర విజయఫలాలు-2023 పురస్కారాలతో ఆయన సత్కరించారు. నిర్వాహకులు పీఎంకే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి


ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ తదితరులు

కాచిగూడ: కంటి వెలుగు శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి పరీక్షలతో పాటు మందులు, కళ్లద్దాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఆపరేషన్ ఉన్న వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని వివరించారు. డాక్టర్ దీప్తి, డాక్టర్ మనోజ్‌రెడ్డి, కొండా శ్రీనివాస్‌రావు, రాపర్తి తారా, మాధవి, మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు మేనేజింగ్ ట్రస్టీ ఆకుల పాండురంగారావు, బీజేపీ నేతలు ఆనంద్ రావు, భీమ్‌రాజ్, సంతోష్ తదితరులున్నారు.

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ మీ సేవా కేంద్రం వద్ద బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులుగా జరుగుతున్న కంటి వెలుగు కేంద్రాల్లో లక్షలాది మంది కంటి పరీక్షలు నిర్వహించుకుని ఉపశమనం పొందుతున్నారని ఈ అవకాశాన్ని అడిక్‌మెట్ డివిజన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు బుజ్జి వెంకటేశ్వర్‌రావు, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, అస్లాం, టక్కర్, సిద్ధిఖ్, సత్యనారాయణ, అనిల్, అరుణ్, వెంకటేష్, రాజేష్, ప్రవీణ్ తదితరులున్నారు.

సుదర్శన నారసింహ హోమం



ముషీరాబాద్: రాంనగర్ సీతారామాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు మండపారాధన, సుదర్శన నారసింహ హోమం, గరుడపట్టాభివాసం, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రవియాదవ్, ఈఓ లక్ష్మారెడ్డి, ధర్మకర్తలు శ్రీధర్ రెడ్డి, రజనీ, గోవర్ధనయాదవ్, శ్రీనివాస్, గోవర్ధన్‌రెడ్డి, అర్చకులు వెంకటరమణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, ప్రతాపశర్మలతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శంకరమఠంలో భారతీ తీర్థ మహాస్వామి వర్ధంతి


ఆయుష్ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నల్లకుంట: దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధిపతి భారతీ తీర్థ మహాస్వామి త్రిసప్తమి(73) వర్ధంతిని నల్లకుంట శంకరమఠంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం శక్తి గణపతికి తొలిపూజలు నిర్వహించి, శంకర భగవత్పాదులు, చంద్రమౌళీశ్వర స్వామి, శారదామాతకు విశేష పూజలు చేసి భారతీ తీర్థ మహాస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగశాలలో ఆయుష్ హోమం చేపట్టగా.. శంకరమఠం నల్లకుంట పూర్వ ధర్మాధికారి ఆర్డీశర్మ దంపతులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ చేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: మోతీమార్కెట్ హైదరాబాద్ స్టీల్స్ రోడ్డులో గత కొంత కాలంగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ జలమండలి డీజీఎం సన్యాసిరావు దృష్టికి తీసుకెళ్లి డ్రైనేజీ మరమ్మతులు చేయించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. జలమండలి ఏఈ గాజుల భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్‌యాదవ్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ. 15 లక్షలతో అభివృద్ధి పనులు


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డిలు

అంబర్‌పేట: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి నిరంతరాయంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ రహత్‌నగర్‌లో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజా అవసరాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. అధికారులు, స్థానిక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

శోభాయాత్ర రూట్‌మ్యాప్‌ను పరిశీలించిన ఈస్ట్ జోన్ డీసీపీ


ఈస్ట్ జోన్ డీసీపీ సునిల్‌దత్, నిర్వాహకులు వెంకట్‌రెడ్డి తదితరులు

అంబర్‌పేట: శ్రీరామనవమి శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఈస్ట్ జోన్ డీసీపీ సునిల్‌దత్ తెలిపారు. ఈనెల 30న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి రాంకోఠి హనుమాన్ వ్యాయమశాల వరకు చేపట్టే ఈ రూట్ మ్యాప్‌ను డీసీపీ నిర్వాహకులతో కలిసి సోమవారం పరిశీలించారు. మున్సిపల్ గ్రౌండ్ నుంచి 6 నంబర్ చౌరస్తా వరకు కలిగే ఇబ్బందులను స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. నిర్వాహకులు వెంకట్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్ తదితరులున్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న అఖిల భారత పెన్షనర్ల సెక్రటరీ జనరల్ సుధాకర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అఖిల భారత పెన్షనర్ల సెక్రటరీ జనరల్ సుధాకర్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం (ఎస్‌జీపీఏటీ) రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లకు ప్రతినెల మొదటి తేదీన పెన్షన్‌లు జమ చేయాలన్నారు. సంఘం అధ్యక్షుడు రాజేందర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి ఎం.వీ.నర్సింగ్‌రావు, నాయకులు కృష్ణప్రసాద్, సూర్యనారాయణ, అంజయ్య, వీరస్వామి, నర్సింహ్మారెడ్డి తదితరులున్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు


మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ వరప్రసాద్

కాచిగూడ: డ్రైవింగ్ చేయడం ఒకటే కాదని అది జీవితానికి సంబంధించిన భద్రతగా గుర్తించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. ప్రయాణికుల భద్రత డ్రైవర్‌పై ఆధారపడి ఉంటుందని డ్రైవింగ్ ఒక్కటే ముఖ్యం కాదని జీవిత భద్రత కూడా ముఖ్యమని సూచించారు. సోమవారం కాచిగూడ డీవీఎం కార్యాలయంలో ఆర్టీసీ డ్రైవర్లకు ఏర్పాటు చేసిన 'టీఎస్ ఆర్టీసీ ఏప్రిల్ ఛాలెంట్ ఫర్ ట్రైనింగ్' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి రోజూ 100 మంది చొప్పున 40 రోజుల పాటు డ్రైవర్లకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ట్రాఫిక్ రూల్స్, రోడ్డు భద్రత, ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగడం వంటి వాటిలో శిక్షణ ఉంటుందన్నారు. ఆర్టీసీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, అధికారులు విజయభాను, జగన్, బర్కత్‌పుర డిపో మేనేజర్ పవన్ కుమార్, కాచిగూడ డిపో మేనేజర్ రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.